# వినియోగిత

ఇవ్వాళ నేను చాలా ఉత్సాహంగా ఉన్నాను.

ఈ మధ్య నేను మార్గదర్శకత్వం వహించిన ఓ ప్రతిష్ఠాత్మకమైన కేసులో విజయం సాధించామని ఈ పూటే తెలిసింది.

నా ప్రతిభకు కృషికి ఇది చిహ్నం మాత్రమే కాదు జనసామాన్యంలో వస్తోన్న చైతన్యానికి ప్రతీక కూడా.

మొదటి సారిగా ఓ జాతీయస్థాయి సంస్థ మీద నెగ్గిన ఘనత మా మిత్రబృందంలో నాకే దక్కింది. అందుకే ఇది నామట్టుకు నాకు మామూలు విజయం కాదు. ఘనవిజయం.

విషయం మామూలుదే.

కొందరు రైతులు వాడిన క్రిమి సంహారక మందులు కల్తీవని తేలింది. పంటచేలలో క్రిమికీటకాలను సంహరించక పోషించాయవి.

ఆగ్రహోదగ్రులైన రైతులు ఎరువుల అంగళ్ళ మీద దాడి చేసారు. ధ్వంసం చేసారు. అయితే విరుచుకు పడిన ఆవేశం వలన ఒనగూరేదేమీ లేదని వారికి గ్రహించడానికి ఎక్కువ సమయం పట్టలేదు. ఆ నష్టానికి మూలమైన వారి నుండి పరిహారం పొంది తీరాలన్న తపన వారిలో మొదలయ్యింది. అందులో భాగంగా కొందరు యువకులు సలహాకై నావద్దకు వచ్చారు.

నిజానికి జరిగిన నష్టాన్ని గురించి ఫోరంలో ఫిర్యాదు చేయడానికి మా ప్రమేయం అవసరంలేదు. అయినా సందేహాలతో సంశయాలతో మా మార్గదర్శకత్వం కోసం ఇలా వస్తూనే వుంటారు.

ఆ క్రిమిసంహారక మందులు తయారు చేసినది ఉత్తరభారతానికి చెందిన ఓ ప్రముఖ కంపెనీ. జాతీయ స్థాయి రాజకీయ నాయకుని సంబంధీకులదది.

నేను వివరాలన్నీ జాగ్రత్తగా సేకరించి - పకడ్బందీగా సాక్ష్యాలు సిద్ధం చేసి వారి చేత ఫోరంలో - ఫిర్యాదు చేయించాను.

ఇక పత్రికల వారికి కావలసినంత పని.

కేస్ పూర్తయ్యేలోగా వారి నాయకురాలిగా నేను ప్రముఖుల జాబితాలో చేరిపోయాను. కానీ అది అంత సులభంగా మాత్రం జరగలేదు.

మన వినియోగదారుల్లో వుండే సలక్షణాలన్నీ ఈ రైతన్నలలోనూ వున్నాయి. వాళ్ళు ఆ మందులు కొన్నప్పుడు తీసుకొన్న రసీదులు-కొన్ని వేరుశనక్కాయల పొట్లాలుగా-కొన్ని చిత్తు కాగితాలుగా-మరికొన్ని చెత్త కాగితాలుగా రూపాంతరం చెందిపోయాయి.

వాటిని వెతికి వుతికి సిద్ధం చేసే సరికి, నాకూ నన్ను కలిసిన ఆ రైతు యువకులకు తలప్రాణం తోకలోకి వచ్చినంత పనయ్యింది.

కొందరు బుద్ధిమంతులు ఏదైనా కొన్నపుడు రసీదు తీసుకోవాలన్న మాట మొట్టమొదటిసారి మా నోటనే విన్నారుట.

చివరికి ఏమయితేనేం- ఆ నలిగిన - చినిగిన - రసీదులకు - ఎరువుల అంగళ్ళలో సేకరించిన నకళ్ళను జతపరచగలిగాం. ఆ మందుల్ని నిపుణుల చేత రసాయన పరీక్షలు చేయించాను.

ఈలోగా పెద్దయెత్తున ఊరేగింపు - సభ జరిపాం దీంతో జరగవలసిన ప్రచారం అంతా జరిగిపోయింది.

ససేమిరా అంటూ మొండికేసిన ఆ కంపెనీ యజమానులు చివరకీ రోజు కల్తీ జరిగిందని అంగీకరించి - తీర్పుకు తల ఒగ్గారు. రైతులకు చెల్లించాల్సిన మూల్యం విషయమై చర్చలకు రమ్మని ఇప్పుడే ఆహ్వానం అందింది.

నేను హుషారుగా నా పనులన్నిటినీ పూర్తి చేసుకొని వారికోసమే ఎదురు చూస్తున్నాను.

అమ్మేవాడికి కొనేవాడు లోకువ కాదని - కొనే వాళ్ళందరూ గ్రహిస్తే అమ్మేవాడు తప్పక దార్లోకి వస్తాడు!

''ఎక్స్ క్యూజ్ మీ!''

నేను ఒక్కసారిగా ఆలోచనల్లోంచి బయట పడ్డాను. నా ఎదురుగా ఒక యువతి నిలబడి వుంది. కూర్చోమని కుర్చీ చూపించాను.

''థ్యాంక్ యూ!'' ఆమె ఒద్దికగా కూర్చుంది.

ఈవిడ ఖచ్చితంగా ఏ మైక్రోవేవ్ ఓవనో - ఏ గ్రైండరో కొని మోసపోయుంటుంది. నేను మాట్లాడబోయే లోపలే ఆవిడ అంది.

''మీ గురించి విన్నాను. నాకు ఈ విషయంలో కొన్ని సందేహాలున్నాయి. నివృత్తి కోసం వచ్చాను.'' ఆమె ఆగి మళ్ళీ అంది.'' నేను ఇక్కడే వుమెన్స్ కాలేజీలో లెక్చరర్ని.''

ఎవరన్నా స్టూడెంట్స్ ట్యూషన్ ఫీజు రసీదు అడిగారేమో! తుంటరి పిల్లలు ఎక్కువవుతున్నారు!

''ఏ వస్తువునైనా కొన్నపుడు ఇచ్చిన వివరాల ప్రకారం-. ఇచ్చిన గ్యారెంటీ ప్రకారం - తరువాతి కాలంలో ఆ వస్తువు ఉండక పోగా - కొన్న వారికి ఇబ్బంది కలిగిస్తే - మీరు నష్ట పరిహారం ఇప్పించగలరు కదా?'' సూటిగా అడిగిందామె.

''తప్పకుండా!'' నేనామెకి భరోసా ఇచ్చి అడిగాను'' మీరు కొన్న ఏదైనా వస్తువు విషయంలో అలా నష్టపోయారా? ఇబ్బందికి లోనయ్యారా?''

ఆమె ఒక్క క్షణం ఆలోచించి ఔనన్నట్లు తలాడించింది.

వచ్చిందే ఆ పని మీదైతే అంత ఆలోచన దేనికో - నేను నిట్టూర్చి - ప్యాడ్, పెన్ తీసుకొని వివరాలు సేకరించడం మొదలెట్టాను.

''మీరు కొన్న ఆ వస్తువు ఖరీదెంత?''

''ఐదు లక్షలు!''

''రసీదు వుందా?''

''లేదు!''

''గ్యారంటీ కార్డు?''

''లేదు!''

చదువుకున్న వాళ్ళు కూడా ఇంత మూర్ఖంగా ఎలా ప్రవర్తిస్తారు? అన్నీ తెలిసి రసీదెందుకు తీసుకోలేదీవిడ? ఒకటా రెండా ఐదులక్షల ఖరీదు చేసే వస్తువు!

''మరి మీరా వస్తువు కొన్నారనడానికి సాక్ష్యం ఏమిటి?''

''నేను!''

''అలా వీలు కాదే!'' నేను ఆలోచిస్తూ అడిగాను ''బ్లాకులో కొన్నారా?''

''కాదు వైటే!''

''ఇంపోర్టెడ్ వస్తువా?''

''దేశీయం!''

''ఎంత కాలం క్రితం కొనుగోలు చేసారు?''

''మూడు సంవత్సరాలు కావస్తోంది!''

''మరోసారి జ్ఞాపకం తెచ్చుకోండి - దాని రసీదు కానీ, గ్యారెంటీ కార్డుకానీ వున్నాయేమో! మీరు ఎప్పుడు.. ఎవరి దగ్గర నుండి.. ఎంతకు కొన్నారన్నది ధృవీకరించడానికి అవి అత్యవసరం.''

''జీవితకాలం గ్యారెంటీ ఇచ్చినట్లు జ్ఞాపకం.''

''కనీసం ఆ వస్తువును ప్యాక్ చేసి ఇచ్చిన ప్యాకింగ్ అయినా వుందా? కొన్ని సార్లు బ్యాచ్ నెంబర్ - వస్తువు కోడ్ నెంబర్ వగైరా వివరాలు ప్యాకింగ్ వలనే తెలుస్తాయి.'' నేను ఓపికగా వివరణలిస్తూ అడుగుతున్నాను.

''ప్యాకింగ్ విప్పి చూసాకే నాకు సత్యం తెలిసింది.''

నాకు చాలా అసహనంగా వుంది. ఇలాంటి తీగలాగుడు వ్యవహారం ఈ మధ్య కాలంలో నాకు తటస్థపడలేదు. ఏమైనా నాదగ్గరకి వచ్చిన వారితో మర్యాదగా ప్రవర్తించడం నా కనీస ధర్మం. నేను నెమ్మదిగా అడిగాను, "ఎవరి నుంచైనా బహుమతా?''

ఆమె కాసేపు ఏమీ మాట్లాడలేదు. దీర్ఘాలోచనలో మునిగినట్లు వేళ్ళతో కణతలు నొక్కుకుంది.

''ఆ.. అలాంటిదే!'' కాస్సేపటికి గొంతు విప్పింది.

''మరి గిఫ్ట్‌టాక్స్ కట్టారా? ఆ రసీదైనా వుందా?'' నాలో ఆశ చిగురించింది.

''నేను కట్టలేదు!''

మళ్ళీ నాకు కావలసిన సమాచారం దొరకలేదు. ఓపిక తెచ్చుకొని అడిగాను.

''పోనీ మీకు బహుకరించిన వారు కట్టారా?''

''తెలీదు!'' ఆమె ధోరణిలో ఆమె సమాధానాలిస్తోంది.

''బహూకరించిన వారికి మీకు సంబంధం ఏమిటి?''

''నా కన్న తండ్రి!''

గుడ్డిలో మెల్ల! ఈవిడకి తెలియక పోయినా ఈవిడ తండ్రికైనా తెలుసుంటాయేమో! పెద్ద తలకాయలు ఇలాంటి కనీస జాగ్రత్తలు తప్పక తీసుకొంటారు!

''మీ నాన్నగారినే తీసుకు రండి, వారికి కొన్న తేదీ షాపు వగైరా వివరాలన్నీ బాగా తెలుసుంటాయి కదా!'' నేను విషయాన్ని స్పష్టపరుస్తూ అన్నాను.

''అక్కర్లేదు! ఆయన కన్నా నాకే బాగా తెలుసు!'' ఆమె తేల్చి చెప్పేసింది.

అయితే ఇక డొంక తిరుగుడు వ్యవహారం దేనికి? చెప్పేదేదో సూటిగా చెప్పండన్నట్లు తలాడించేను నేను.

ఆమె ఏకధాటిగా చెప్పడం మొదలెట్టింది.

నేను మొదట మొక్కుబడిగా వినడం మొదలు పెట్టినా - నాకు తెలియకుండానే కుతూహలంగా శ్రద్ధగా వినడం కొనసాగించాను.

"చాలా మామూలు విషయమే ఇది. నిజానికి ఇప్పుడిది ఒక విషయంగా భావించే స్థాయిలో కూడా లేదు.

మూడేళ్ళ క్రితం ఆ వస్తువు నా యింటికే వచ్చి, నావాళ్ళ ముందరే నన్ను రకరకాల పరీక్షలకు గురిచేసి - చివరికి నేను తనని స్వంతం చేసుకోవడానికి అర్హురాలినని తేల్చింది. నా వాళ్ళంతా నన్నెంతో అదృష్టవంతురాలినన్నారు. ఆ వస్తువు తళుకు బెళుకులు చూసి మురిసిపోయారు. నన్ను మురిపింప చేసారు. మానాన్న మారు బేరాలాడకుండా ఆ వస్తువుకు నిలువెత్తు ధనం పోసి - నాపరం చేసాడు. కాదు చేసానని అనుకొన్నాడు. నిజానికి నన్నే ఆ వస్తువుకు ధారాదత్తం చేసాడు.

"అప్పుడు గ్యారెంటీ అడగడానికి - ఇచ్చిన డబ్బుకు రసీదు పుచ్చుకోవడానికి నా అరమోడ్పు కళ్ళల్లో కలల పరదాలు అడ్డున్నాయి. అయితే అవి తొలగి పోయే రోజు త్వరలోనే వచ్చింది. నా కంటి నీరు వరదలైన రోజు - నా స్వాభిమానం ధనంతో పాటు ఆ వస్తువు పరం చేసానని నేను గ్రహించిన రోజు - ఆ రోజు నేను లోకంలో పడ్డాను."

ఆమె మాటల వేగానికి నేను నిర్ఘాంత పోయాను. ఆమె నా అభిప్రాయంతో ప్రమేయం లేకుండా చెప్పుకుపోతోంది. నాకు నెమ్మదిగా విషయం స్పష్టపడుతోంది.

"ఆ వస్తువుకు కావలసిన ప్రధాన ఇంధనం డబ్బు. నేను ఇంట్లో చేసే జీతం భత్యం లేని చాకిరీకి జీతం గీతం సంపాదించే నౌకరీ తోడయ్యింది. అయినా ఆ వస్తువుకు నేను అందించే ఇంధనం చాలడం లేదు. ఎంతకని నేను దాని దాహం తీర్చగలను? నేను శారీరకంగా ఎంతటి వత్తిడికైనా సిద్ధమే. కానీ ఆ తప్పు పట్టిన వస్తువు నామెదడును తొలిచేస్తోంది. నా కదలికలన్నింటినీ నియంత్రిస్తోంది. ఎప్పుడు జీవించాలో ఎలా జీవించాలో అంతా దాని నిర్ణయమే! పరాధీనతలో జీవనం జీవం లేని జీవనం కాదూ?"

నేనామెకు సమాధానం చెప్పేలోగా నా అనుమానం నివృత్తి చేసుకోవాలి. అందుకే సూటిగా అడిగాను, "మీరనే వస్తువు మీ జీవిత భాగస్వామి అయితే కాదు కదా?"

"అవును!"

ఆమె వాదన వెనుక ఆమె అనుభవించిన వేదన వుండొచ్చును. కానీ, నేనేం చెయ్యగలను? అందుకే నేను స్పష్టంగా తేలిగ్గా అనేసాను.

''అయితే ఇది వేరే విషయం అన్నమాట! మొదట్లో మీ ధోరణి చూసి ఫోరంలో కేసు వేయడానికి వచ్చారను కొన్నాను.''

''నేను ఫోరంలో కేసు వేయడానికే వచ్చాను!'' ఆమె స్పష్టంగా గంభీరంగా అంది.

నేను ఆమె వైఖరికి విస్తుబోయాను. ఆమె కొనసాగించింది.

''అతను మా సంబంధాన్ని ఆర్థిక దృక్పథంతోనే గుర్తిస్తున్నపుడు - నేను మా సంబంధంలోని అనుబంధం గురించి - హృదయాల కలయిక గురించి - అనుభూతుల కలబోత గురించి మాట్లాడడంలో అర్థం లేదు. ఇప్పుడు నేనూ ఆర్థిక దృక్పథంతోనే అతన్ని గుర్తించదలుచుకొన్నాను!''

''అయితే ఏం చేయాలంటారు?'' నేను ఆశ్చర్యంగా అడిగాను.

''చూడండి...మీ చట్టం ప్రకారం ఏ వస్తువుదైనా నిర్ధారించబడిన వెల చెల్లించినపుడు దానిపై అధికారం ఎవరికి వుంటుంది?''

''డబ్బు చెల్లించిన వారికే!''

''మరి ఈ విషయంలో ఎందుకలా లేదు? డబ్బును చెల్లించింది నేను. స్వేచ్ఛను కోల్పోయింది నేను. అస్వతంత్రురాలిని అయ్యింది నేను.''

నేను ఏమీ మాట్లాడలేదు. ఆమె చాలా ఆవేశంలో వుంది. నేనేం చెప్పినా వినిపించుకొనే అవకాశమే లేదు.

''గ్యారెంటీ విషయం అడిగారు కదా! వినండి. అతను ఎంతో సంస్కారవంతుడనీ సహృదయుడనీ సద్గుణ సంపన్నుడనీ మమ్మల్ని నమ్మించారు. మేమూ నమ్మాం. అయితే, మా నమ్మకం ఓ రూపు దిద్దుకోక ముందే వమ్మయింది. నేను ఆశించిన అభిమానం గౌరవం అలాంటి వాటికి ఆస్కారమెక్కడసలు? నేను కురిపించిన ప్రేమాభిమానాలకే స్పందన లేదక్కడ. నిజానికి నేను వాస్తవ దృక్పథంతో ఆలోచించే - అతని కోరికలన్నిటికీ తల ఒగ్గే అతనికి చేరువ అయ్యాను. ఇది నాతప్పే! కానీ ఎంత కాలం ఇలా? ఆప్యాయతా అనురాగాలకు తావు లేని చోట మానవ సంబంధాలు మనగలుగుతాయా? మీరే చెప్పండి.''

నేను ఆమె ఆలోచనలను అర్థం చేసుకొనే క్రమంలోనే వున్నాను. ఆమెవంక చూస్తూ వుండడం మినహాయించి - ఏం చెప్పగలను?

''మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధమైనవి మాత్రమే కావు. అంతకన్నా అతీతమైన సున్నితమైన సుందరమైన మధురమైన అనుభూతులెన్నో పెనవేసిన బంధం కావాలని నేనిక చిలక పలుకులు పలకదలుచుకోలేదు.

ఎందుకంటే ఆ పలుకులకు సాకారం కల్పిద్దామనే ప్రయత్నంలో నేనెంతో మానసిక క్షోభకు గురయ్యాను. అతని ఆర్థిక దృక్పథంలో అవన్నీ అర్థం పర్థం లేని మాటలు. నేను అతని దృక్పథంతోనే అతనిని గుర్తిద్దామను కొంటున్నాను.

నాకున్న ప్రాధాన్యతను కూడా అతని వాస్తవ దృక్పథంతో అతను గుర్తించేలా చేద్దామనుకొంటున్నాను.''

ఈవిడ ఉద్దేశం ఏమిటి నా కనుబొమలు ముడిపడ్డాయి.

''నిజానికి నా యిష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండానే మా నాన్నకూ అతనికి మధ్య ధనమార్పిడి జరిగింది. కానీ ఆ లావాదేవీలలో వినియోగిత నైన నాకు తీవ్రనష్టం జరిగింది. నాప్రాథమిక హక్కులకు భంగం కలిగింది. అది నేను గుర్తించడానికి ఆలస్యమే జరిగింది.

పంట చేలకు వేసే మందులలో కల్తీవస్తే - అందర్నీ కూడ గట్టి - ఎంతో కష్టపడి -పోరాడి- ఆ నష్టం పూరించడానికి మీరు ప్రయత్నిస్తున్నారే... అందుకు అభినందలు.

అయితే, ఎన్ని తరాలుగా ఆ మనుషుల మనసులు డబ్బుగబ్బు పట్టి కల్తీ అయ్యాయో మీరెవరైనా గుర్తించారా? ఆ కల్తీ మనుషుల కల్తీ నిర్ణయాల వలన ఎన్ని పచ్చని జీవితాలు ఎన్ని విధాలుగా నష్టపోతున్నాయో గ్రహించారా? ఆ నష్టాన్ని ఎవరు గుర్తించాలి? ఎవరు పూరించాలి?

వినియోగితను కావడమే నా జీవితమని నేను ఆత్మికంగా మలచబడ్డాను. భౌతికంగా నా బలం బలహీనమై పోయింది.

ఈ వినిమయరంగంలో శారీరకంగా మానసికంగా ఆర్థికంగా వినియోగించుకోబడే వినియోగితగా ఎంతకాలమని వుండిపోను?

ఇప్పుడు నేనందుకు సిద్ధంగా లేను.

ఒకవేళ అతను నన్నింకా అలాగే వుంచదలిస్తే - ఈ వినిమయ రంగంలో నా అస్తిత్వం కాపాడుకోవడం కోసం నేను పోరాడక తప్పదు. వస్తువుగా మారిన ఆ వ్యక్తి నిజాన్ని గ్రహించక తప్పదు. అందుకే మీ సలహాలకై వచ్చాను.

నా అభిమాన, ధన, ప్రాణాలను పణంగా పెట్టి సొంతం చేసుకొన్న ఆ 'వస్తువు' వలన ఒక వ్యక్తిగా నాకు జరిగిన నష్టానికి కలిగిన మనస్తాపానికి - మీ చట్టం ప్రకారం నష్టపరిహారం ఎందుకు ఇప్పించకూడదు?

ఓ వినియోగదారురాలిగా నా మౌలిక హక్కులకు రక్షణ ఎందుకు కల్పించకూడదు? చెప్పండి! ''ఆమె సూటిగా - ఆవేశంగా - ఆవేదనతో నిలదీస్తోంది.

నిజమే-

ఆమె లేవనెత్తిన అంశాలన్నింటిని వివిధ చట్టాల పరిధిలోకి తీసుకువచ్చి న్యాయం కోసం ప్రయత్నించ వచ్చును. కానీ ఆమె కోరుతోంది సామాజిక న్యాయం.

నేనేం సమాధానం ఇవ్వగలను?

అయినా - నేనెలా సమాధానం ఇవ్వగలను?

పాతికేళ్ళ క్రితమే నేనూ ఓ వినియోగితనై వినమ్రంగా నా భర్తకు స్వంతం అయ్యాను.

నా భర్త ఈ మధ్యనే నాకూతురిని వేరొకరికి వినియోగితవు కమ్మని సగౌరవంగా సాగనంపాడు.

నా తండ్రి నా అభిప్రాయం అడగాలని అనుకోలేదు..

నాభర్త నా అభిప్రాయం అవసరం అనుకోలేదు.

ఇపుడు, నా మెడికో కొడుకు నిర్ణయం తీసేసుకొన్నాడు - చదువుకొన్న అందమైన - గ్రీన్ కార్డున్న - కోటీశ్వరుల - ఏకైక పుత్రిక కావాలని!

వాడి కోరికలన్నీ తీర్చాలిసిన వినియోగిత ఎక్కడో పుట్టే వుంటుంది!

ఏదో ఒకరోజు ఆమె కూడా ఇలానే నిలదీస్తుంది.

ఈలోగా సమాధానాలు సిద్ధం చేసుకోవాలి.

నేను మాత్రమే కాదు. నా కొడుకు కూడా!

తప్పదు!!

ఆంధ్రజ్యోతి ఆదివారం; 18.8.96